క్లుప్తంగా

తిరుపతి శృంగార వల్లభుని ఆలయానికి భక్తుల రద్దీ



పూజలందుకుంటున్న శృంగారవల్లభ స్వామి

పెద్దాపురం: తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం భక్తుల రద్దీ పెరిగింది. ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు స్వామి వారిని పూలమాలికలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని వివిధ సేవల టిక్కెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామి వారికి రూ.1,76,322 ఆదాయం సమకూరినట్లు ఈఓ శ్రీనివాస్ తెలిపారు. సుమారు 10 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకోగా నాలుగు వేల మందికి ప్రసాద వితరణ, అన్నదానం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

పెద్దాపురంలో శాంతి ర్యాలీ



ఆర్డీఓ కార్యాలయం వద్ద నినదాలు చేస్తున్న పాస్టర్లు

పెద్దాపురం: రాజమహేంద్రవరం వద్ద జరిగిన పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపైన్యాయం చేయాలంటూ శనివారం పెద్దాపురం పట్టణ, మండల పాస్టర్లు, క్రైస్తవులు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. స్థానిక పట్టణ పురవీధుల్లో భారీ ర్యాలీ చేపట్టి మున్సిపల్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. మోకాళ్లపై నిలబడి ప్రవీణ్ ఆత్మకు శాంతి చేకూరాలంటూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ గా వెళ్లి ఆర్డీఓ కార్యాలయ డీటీ భానుకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా క్లాప్స్ అధ్యక్షుడు పురుషోత్తమ్‌దాస్ లంక, సీజీఎం వ్యవస్థాపకులు నంగిన శామ్యూల్ సుదీప్, రెవరెండ్ మధుకిరణ్, స్టీఫెన్ చందు తదితరులు మాట్లాడుతూ ప్రవీణ్ ప్రగడాల మృతిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలన్నారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టరలు కెపా, జాన్ సునందన్, బిషప్ బ్లెస్సింగ్, విల్సన్, దానియేలు లాజరస్, ఆనంద్ శామ్యూల్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కృషి



విభిన్న ప్రతిభాంతులకు పరికరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే, కౌడా చైర్మన్

పెద్దాపురం: విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప, కౌడా చైర్మన్ తుమ్మల బాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు అన్నారు. శనివారం స్థానిక లూథరన్ హైస్కూల్‌లో భవిత విద్యార్థులకు వీల్‌చైర్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే పది మంది లబ్ధిదారులకు వీల్‌చైర్స్, ఐదుగురికి ట్రై సైకిల్స్, నలుగురుకి బ్రెయిల్ కిట్స్, 28 మందికి వినికిడి యంత్రాలను అందజేశారు. భవిత ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు విత్తనాల వెంకటరమణ, ఎంపీడీఓ శ్రీలలిత, సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాలరావు, సీఎంఓ చామంతి నాగేశ్వరరావు, డీవైఈఓ ప్రభాకరశర్మ, పెద్దాపురం సామర్లకోట ఎంఈఓలు చౌదరి రామకృష్ణయ్య, పుల్లయ్య, భవిత సిబ్బంది పాల్గొన్నారు.

టీటీడీసీ జాబ్ మేళాలో 26 మంది ఎంపిక

సామర్లకోట: స్థానిక టీటీడీసీలో శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి సంస్థ, సిడాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో 26 మంది ఎంపికయ్యినట్టు సిడాప్ జెడీఎం కిరణ్, జిల్లా నైపుణాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు తెలిపారు. బ్ల్యూష్ బయోటెక్, టీమ్ లీజ్, ఎల్‌జీ ఆథరైజ్డ్ సెంటర్‌లో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలకు 54 మంది హాజరయ్యారని చెప్పారు.

గ్రీవెన్సు రద్దు

పిఠాపురం: స్థానిక పాడా కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక గ్రీవెన్సును రంజాన్ పండుగ సందర్భంగా రద్దు చేసినట్టు పాడా పీడీ చైత్ర వర్షిణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలందరు ఈవిషయాన్ని గమనించి సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేసారు.

చింత.. ఆరోగ్యం మీ చెంత

- వేసవిలో చింత చిగురుకు పెరిగిన గిరాకీ
- ఎంతో ప్రయోజనకరమంటున్న వైద్యులు

పెద్దాపురం: వేసవి సీజన్ ప్రారంభమైంది. ప్రతి ఒక్కరికి వంటకాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతారు. అటువంటిది వేసవిలో చింత చిగురు కనిపిస్తే ఆగుతారా దానితో వంటకాలు మొదలుపెడతారు. చింత చిగురుతో వండిన వంటల రుచే వేరు. సీజన్‌లో వచ్చే చింత చిగురుకు మార్కెట్లో మంచి గిరాకీ కూడా ఉంది. ఒకప్పుడు చెట్ల కిందకు వెళ్లి చింత చిగురు కోసం ఎదురు చూస్తు వాటిని కొనుకుని ఇంటికి తీసుకువచ్చి పప్పు చింతకూరతో భోజనం ఆరగిస్తే మరి ఆ ఆనందమే వేరు కదండి మరి..! ఈ చింతను ఆహారంలో తీసుకుంటే చాలా ప్రయోజనాలుంటున్నాయంటున్నారు వైద్యులు. అవేవో చూసేద్దాం మరి..

చింత చిగురుతో ఉపయోగాలివే..

చింత కూర వండుకుని తిన్నా, పచ్చిగా తిన్నా ఎలాగైనా సరే తినేయవచ్చు. ఈ చింత చిగురులో డైటరీ ఫైబర్ పుష్కళంగా ఉంటుంది. దీంతో ఇది సహజ సిద్ధమైన లాక్సేటీవ్‌గా పని చేస్తుంది. ఫినాల్స్ యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండడంతో చింత చిగురు చెడు కొల్రస్టాల్‌ను తగ్గించి మంచి కొల్రస్టాల్‌ను పెంచుతుంది. చిగురును ఉడికించిన నీటిని పుక్కలిస్తే గొంతినొప్పి, మంట, వాపు తగ్గుతాయి. యాంటీ ఇన్‌ఫ్లమెటరీ గుణాలు చింత చిగురులో ఉండడమే ఇందుకు కారణం. కడుపులో నులిపురుగులుతో బాధపడుతున్న చిన్నారులకు చింత చిగురుతో చేసిన వంటలు తినిపిస్తే ఫలితం ఉంటుంది. జీర్ణాశయ సంబంధ సమస్యలను తొలగించడంలోనూ చింత చిగురు బాగా ఉపయోగపడుతుంది. చిగురులో విటమిన్ సీ, యాంటీ అక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి. ఇవి శరీరంలో రోగ నిరోధక వ్యవస్థను పటిష్టపరుస్తాయి. తరచూ చింత చిగురును తినడం వల్ల ఎముకలు ధృడత్వాన్ని సంతరించుకుంటాయి. థైరాయిడ్‌తో బాధపడేవారు చింత చిగురును తమ ఆహారంలో తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. గుండె జబ్బులను చింత చిగురు దరి చేరనీయదు. శరీరంలో ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి అవసరమైన పోషకాలను అందించడమే గాక రక్తాన్ని శుద్ధి చేస్తుంది.



చింత చిగురుతో మంచి ఆరోగ్య పోషకాలు



సీజన్‌లో చింత చిగురు సేవించడంతో మంచి ఆరోగ్య పోషకాలు అందుతాయి. వేసవిలో అందుబాటులో ఉండే చింత చిగురును తప్పకుండా వంటకాల్లో గాని, పచ్చిగా గాని తీసుకోవడం వల్ల చలా ఉపయోగాలున్నాయి. పైన సూచించిన అన్ని జబ్బులకు చింత చిగురు చాల ఉపయోగకరంగా ఉంటుంది.

– డాక్టర్ జగదాంబ,
ఏరియా ఆసుపత్రి వైద్యులు, పెద్దాపురం

నవ ధాన్యాలతో సాగులో నవ చైతన్యం

పిఠాపురం: రసాయనక ఎరువులు పురుగు మందులు వాడడం ద్వారా సారం కోల్పోతున్న భూమికి తిరిగి సారం అదించడంలో కీలక పాత్ర పోషించేవి నవధాన్యాల సాగని గో గాయత్రి ప్రకృతి వ్యవసాయ వనరుల తయారీ, శిక్షణా కేంద్ర నిర్వాహకుడు ప్రకృతి వ్యవసాయ రైతు గుండ్ర శివచక్రం అన్నారు. గొల్లప్రోలు మండలం దుర్గాడ బయో ఇన్‌పుట్ సెంటర్‌లో శనివారం నవ ధాన్యాల పీఎండీఎస్ కిట్ల తయారు చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడారు. పీఎండీఎస్ నవ ధాన్య సాగు వల్ల జీవ వైవిధ్యం పెరిగి 365 రోజులు బహుళ పంటల సాగు సాధ్యమవుతుందన్నారు. అందుకే వీటిని కిట్లగా తయారు చేసి రైతులకు అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు ఆయన తెలిపారు. వీటి సాగు వల్ల చీడపీడల బెడద పూర్తిగా తగ్గి దిగుబడులు పెరిగి పెట్టుబడి తగ్గి రైతుకు ఆదాయం పెరుగుతుందన్నారు. రైతులు వీటిని సాగు చేయడం ద్వారా భూమి సారవంతమవుతుందని, ఆరోగ్యకరమైన లాభదాయకమైన పంటలను పండించవచ్చని ఆయన అన్నారు. ప్రస్తుతం ఎక్కువ మంది రైతులు వీటి సాగుపై ఆసక్తి చూపుతున్నారని, పకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది ద్వారా వీటిని తయారు చేసి రైతులకు అందజేస్తున్నట్టు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది సీఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ పేరును పునరుద్ధరించాలి

- చర్చకు వీలుగా ఉండేలా అంశాలను పొందుపర్చాలి
- ఐదు అంశాలను వాయిదా వేసి వాకౌట్ చేసిన సభ్యులు

సామర్లకోట: జగనన్న కాలనీలోని వైఎస్సార్ విగ్రహానికి ఎన్నికల కోడ్ పూర్తయినా ముసుగు తొలగించలేదని కౌన్సిలర్ వారా పాప అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. విగ్రహం ఎత్తుగా ఉండడం వలన తొలగించడంలో పొరపాటు జరిగిందని, వెంటనే ముసుగు తొలగిస్తామని కమిషనర్ ఎ.శ్రీవిద్య అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అధ్యక్షతన శనివారం కౌన్సిల్ సమావేశం జరిగింది. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జగనన్న కాలనీని ప్రారంభించారని, అక్కడ ఆర్చికి గతంలో సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకొని రంగులు వేశారని, ఎన్నికల కోడ్ పూర్తయినా తిరిగి జగనన్న కాలనీ అని పేరు ఎందుకు రాయలేదని వైస్‌చైర్మన్ ఉబా జాన్‌మోజెస్ ప్రశ్నించారు. ఒక ప్రభుత్వంలో ప్రారంభించిన తరువాత పెట్టిన పేరు మార్చు చేయడానికి వీలేదని వెంటనే పేరును రాయించాలని మోజెస్ డిమాండ్ చేశారు. అజెండాలో అంశాలు చర్చ సందర్భంగా ఒక నెలలో జరిగే సమావేశంలో 56 అంశాలను పొందుపర్చడం ఎంత వరకు సమంజసమని వాటిపై సభ్యులకు ఏవిధంగా అవగాహన ఉంటుందని వైస్ చైర్మన్ మోజెస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 13, 35, 37, 38, 55 అంశాలను వాయిదా వేయాలని వైస్‌చైర్మన్‌తో పాటు ఆవాల లక్ష్మీనారాయణ, జట్ల మోహన్, నేతల హరిబాబు, పిట్టా సత్యనారాయణలు ప్రకటించి మెజార్టీ వైఎస్సార్ సీపీ సభ్యులు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. మఠం సెంటర్‌లో కల్వర్టు నిర్మాణాన్ని వెంటనే ఆమోదించి పనులు ప్రారంభించకపోతే ప్రమాదాలు జరుగుతాయని దానికి కౌన్సిల్ బాధ్యత వహించవలసి వస్తుందని టీడీపీ సభ్యులు బలుసు వాసు, పితాని కృష్ణ అన్నారు. మఠంసెంటర్‌లో పూడిక తీసే సమయంలో కల్వర్టు తొలగించే పరిస్థితి వస్తే దానిని కౌన్సిల్‌కు తీసుకు రాకుండా తొలగించడంతో పాటు దాని నిర్మాణానికి రూ.3.50 లక్షలు కేటాయించి ప్రజా ధనం దుర్వినియోగం చేయడంతోనే ఆ అంశాన్ని వ్యతి రేకించామని వైస్‌చైర్మన్ మోజెస్ తెలిపారు. కల్వర్టు తొలగింపు పూడికతీతలో భాగమే ఆ నిధుల నుంచి కాంట్రాక్టరు కల్వర్టు నిర్మాణం చేయాలని మోజెస్ సూచించారు. అంతకు ముందు కొత్తూరులో మున్సిపల్ షాపులు లీజు పొడగింపు అంశంపై నేతల హరిబాబు, జట్ల మోహన్, వైస్‌చైర్మన్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ షాపులలో స్థానికేతరులే లీజుదారులుగా ఉన్నారని వారు తెలిపారు. షాపుల లీజు వేలం నిర్వహించే సమయంలో జిల్లా స్థాయిలో వేలం జరుగుతుందని, హెచ్చు పాటదారులకు షాపులను కేటాయిస్తామని కమిషనర్ ఎ శ్రీవిద్య తెలిపారు. 25ఏళ్ల వరకు లీజుదారులకు, లీజు నిబంధనల ప్రకారం అద్దె పెంచుతూ ఇవ్వాల్సి ఉందని, లీజుదారులకు కుల ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయని ఆర్వో శ్యామల తెలిపారు. ఆశీల వేలం విషయంలో గతంలో బకాయి ఉన్నవారు వారి భార్యల పేరును పాటలో పాల్గొంటున్నారని, వీటిని గమనించాలని వైస్‌చైర్మన్ మోజెస్, పిట్టా సత్యనారాయణ, నేతల హరిబాబులు సూచించారు. కోవిడ్ సమయంలో మినహా మిగిలిన కాలంలో బకాయి దారులు లేరని కమిషనర్ స్పష్టం చేశారు.



అధికారుల తీరును తప్పు పడుతున్న కౌన్సిల్ సభ్యులు



సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇస్తున్న చైర్‌పర్సన్, అధికారులు

కౌన్సిల్ సమావేశంలో ప్రొటోకాల్ రగడ

- అధికారుల తీరుపై సభ్యుల ఆగ్రహం
- సమాచారం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్న
- వాడీవేడిగా పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పెద్దాపురం: కౌన్సిల్ సభ్యులంటే మున్సిపల్ అధికారులకు లెక్కలేకుండా పోతుందా?, కనీసం ప్రోటోకాల్‌ను కూడా పాటించరా అంటూ పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం దద్దరిల్లింది. మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన శనివారం కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, విడదాసరి రాజా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ4 విధానంపై జరిపే అవగాహన సదస్సులకు కౌన్సిల్ సభ్యులకు సమాచారం ఇవ్వలేదన్నారు.

- కౌన్సిలర్ రాజశేఖర్ మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో పట్టణంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై కమిషనర్ పద్మావతి వివరణ ఇస్తూ పట్టణంలో నాలుగు ప్రధాన కూడళ్ల వద్ద చలివేంద్రాల ఏర్పాటు చేయాలని ఆదేశాలున్నాయన్నారు. మున్సిపల్ సెంటర్‌లో చలివేంద్రం నిర్వహణను మున్సిపాలిటీ భరిస్తుందని, మిగిలిన మూడు కేంద్రాల నిర్వహణకు దాతలు ముందుకు రావాలన్నారు. రాజశేఖర్ మాట్లాడుతూ అన్ని కూడళ్ల వద్ద చలివేంద్రాలను మున్సిపాలిటీయే నిర్వహించాలన్నారు.
- కౌన్సిలర్ విడదాసరి రాజా మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, కాపు రుణాలు ఎన్ని మంజూరయ్యాయి, ఎంత సబ్సిడీ, ఎన్ని దరఖాస్తులు వచ్చాయి అనే వివరాలు కౌన్సిల్‌కు ఎందుకు తెలిపడం లేదని అధికారులను ప్రశ్నించారు. కమిషనర్ స్పందిస్తూ అన్ని కలిపి 81 రుణాలు మంజూరుయ్యాయని, దరఖాస్తులు వందల సంఖ్యలో వచ్చాయన్నారు. సీనియర్ కౌన్సిలర్ రాజశేఖర్ మాట్లాడుతూ పట్టణంలో పీ4 సర్వే, రుణాల మంజూరు, ఈకేవైసీ, హౌసింగ్ తదితర శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు తెలియకుండానే సమాచారం లేకుండా అధికారులు చర్యలు తీసుకోవడం సమంజసం కాదన్నారు. ప్రధాన రహదారిలోని సెంటర్ డివైడర్‌లో లైటింగ్, మొక్కల పెంపకంపై చర్యలు తీసుకోవాలన్నారు.
- కౌన్సిలర్ పప్పల దుర్గారావు మాట్లాడుతూ తమ వార్డులో మంచినీటి పైపులైన్ల లీకేజీలను పట్టించుకోవడం లేదన్నారు. సత్వరమే గోదావరి మంచినీటి సరఫరాపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై డీఈ ప్రకాశరావు వివరణ ఇస్తూ మరో 20 రోజుల్లో మంచినీటి సరఫరాను పూర్తి స్థాయిలో ఇస్తామన్నారు.
- వైస్ చైర్మన్ సాయి ప్రసాద్ మాట్లాడుతూ నూతన పైపులు ఏర్పాటు చేసి, పూర్తిస్థాయిలో లీకులు అరికట్టాలన్నారు.
- చైర్మన్ బొడ్డు తులసీ మంగతాయారు మాట్లాడుతూ పట్టణంలో పీ4 సర్వేను సక్రమంగా నిర్వహించడం లేదన్నారు. అనంతరం పలు సమస్యలపై వాడివేడిగా చర్చ జరిగింది. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, డీఈ ప్రకాశరరావు, మేనేజర్ జ్యోతిరాణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ, కౌన్సిలర్లు ముప్పన శ్యామలాంబ, ఆకుల కృష్ణ బాపూజీ, త్సలికి సత్య భాస్కర్, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ, ఆయా విభాగాల అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.





మున్సిపల్ సమావేశంలో అధికారులను నిలదీస్తున్న సీనియర్ కౌన్సిలర్ రాజశేఖర్, సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ తులసీ మంగతాయారు (ఇన్‌సెట్‌లో)

టీడీపీ, జనసేనకు జలక్

- కొత్త కాంట్రాక్ట్ కమిటీ ఎన్నికకు ఆపార్టీల పట్టు
- ఓటింగ్‌లో వైఎస్సార్ సీపీ పైచేయి కావడంతో పాత కమిటీ కొనసాగింపు

పిఠాపురం: ఆరుగురు పార్టీలో చేరారో లేదో వారిని వెంటేసుకుని వైఎస్సార్ సీపీకి చెందిన కౌన్సిలర్లను ఇరకాటంలో పెట్టాలని టీడీపీ, జనసేన కౌన్సిలర్లు చేసిన ప్రయత్నాలకు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు దీటుగా సమాధానం చెప్పారు. పిఠాపురం మున్సిపల్ సాధారణ సమావేశం శనివారం మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన నిర్వహించారు. తొలుత ఇటీవల మృతి చెందిన కౌన్సిలర్ పైలా దర్గాజీ మృతికి సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఈ సమావేశంలో అధికారులు అజెండా చదువుతుండగా కమీసనర కనకారావు మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్టు కమిటీ పదవీ కాలం పూర్తయినందున కొత్త కమిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నామని సభ్యులు తమ అభిప్రాయాలను తెలిపి ఎవరిని నియమించాలి అనే విషయాన్ని తెలియజేయాలని సభ్యులను కోరారు. దీంతో టీడీపీ, జనసేనకు చెందిన కౌన్సిలర్లు లేచి మాట్లాడుతూ ఏడుగురి సభ్యులు ఉన్న కమిటీలో టీడీపీకి రెండు జనసేనకు రెండు వైఎస్సార్ సీపీకి రెండు కేటాయించి కొత్త కమిటీని ఏర్పాటు చేయాలని పాత కమిటీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో బలాబలాలు చూపించాలని మెజార్టీ కౌన్సిలర్ల సూచన మేరకు కమిటీని నియమించాలని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు కోరగా టీడీపీ కౌన్సిలర్లు ఇటీవల జనసేనలో చేరిన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లతో కలిసి వాగ్వాదానికి దిగారు. బలాలు నిరూపించుకునే ప్రయత్నం చేసిన టీడీపీ జనసేన కౌన్సిలర్లు పది మంది కూడా లేక పోవడంతో తోక ముడిచి వెనక్కి తగ్గి చైర్‌పర్సన్‌ను కోరుతున్నామని, మాకు అవకాశం కల్పించండంటూ విజ్ఞప్తి చేశారు. ముందు ఇలా అడగడం మానేసి వాటాలు పంచడం ఏమిటని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు టీడీపీ జనసేన కౌన్సిలర్లను ఎద్దేవా చేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. చివరకు మెజార్టీ సభ్యులు అభిప్రాయం మేరకు కమిటీని నియమించాలని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు కోరగా చైర్ పర్సన్ అందుకు అంగీకరించడంతో కమిషనర్ కమిటీపై తమ అభిప్రాయాలు చెప్పాలని కోరారు. ఓటింగ్ నిర్వహించగా మెజార్టీ సభ్యులు వైఎస్సార్ సీపీకి ఉండడంతో వారి అభిప్రాయం మేరకు పాత కమిటీనే కొనసాగిస్తు కౌన్సిల్ తీర్మానం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాకా గతంలో అనుమతి ఇచ్చిన పలు అభివృద్ధి పనులను రద్దు చేయాలని ప్రభుత్వం ఆదేశించగా వాటిని అధికారులు ఇటీవల రద్దు చేశారు. ఇలా అభివృద్ధి పనులను రద్దు చేయడమేమిటని అభ్యంతరం తెలిపిన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు తిరిగి ఆయా పనులను మళ్లీ అజెండాలో పెట్టగా టీడీపీ, జనసేన కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయినప్పటికి మెజార్టీ సభ్యులు అంగీకారం తెలపడంతో ఆయా పనులను ఆమోదించారు. పిఠాపురం మున్సిపల్ గెస్ట్‌హౌస్‌లో పాడా కార్యాలయం ఏర్పాటుకు ఖర్చు చేసినా నిధులకు ఆమోదం తెలపాలని అజండాలో ఉండగా దానికి వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు కొందరు అభ్యంతరం చెబుతూ వసతి గృహాన్ని కార్యాలయ ఏర్పాటుకు ఎంతకు అద్దెకు ఇచ్చారు. ఎంత ఆదాయం వస్తుంది దానిని బాగు చేయడానికి ఎంత ఖర్చు పెట్టారు వంటి వివరాలు సక్రమంగా లేకుండా ఆమోదం కుదరదని చెప్పడంతో ఆ అంశాన్ని తిరస్కరించారు. స్థానిక డ్రైవర్స్ కాలనీలో చేయని పనులకు రూ .4 లక్షలు బిల్లులు తీసుకున్నారని ఆ విషయంపై ఏచర్యలు తీసుకున్నారో చెప్పాలని కొందరు కౌన్సిలర్లు ప్రశ్నించడంతో కమీషనర్ కనకారావు మాట్లాడుతూ అలా చేయని పనులకు బిల్లులు తీసుకున్నవి సుమారు 40 లక్షలకు పైగా ఉన్నాయని వాటిని ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చామని వారి ఆదేశాలు వచ్చాకా ఏవిధమైన చర్యలు తీసుకోవాలో నిర్ణయిస్తామని సమాధానం చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కాంట్రాక్టు కమిటీ కొనసాగించాలని కోరుతూ నిలబడి అంగీకారం తెలుపుతున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు

నలుగురి యువకులకు దేహశుద్ధి

కొత్తపల్లి: అర్ధరాత్రి సమయంలో మద్యం సేవించి మత్తులో ఒక ఇంటి ఆవరణలోకి ప్రవేశించిన నలుగురు యువకులకు గ్రామస్తులు దేహశుద్ధి చేశారు. వివరాలలోకి వెళితే రమణక్కపేటలో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో నాగులాపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు శ్రీరాంపురంలో జాతరకు వెళ్లి తిరిగి వస్తున్నారు. ఆ ముగ్గురు యువకులు మద్యం సేవించి మద్యం మత్తులో ఒక ఇంటి ఆవరణంలోకి వెళ్లడంతో దొంగలనే అనుమానంతో కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు పట్టుకున్నారు. ఒక స్తంభానికి కట్టి దేహశుద్ధి చేశారు. మద్యం మత్తులో ఉన్న ఆ యువకులు సమాధానం చెప్పకపోవడంతో పోలీసులకు అప్పగించారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



యువకులను స్తంభానికి కట్టిన గ్రామస్తులు


పోక్సో చట్టంపై అవగాహన ఉండాలి

పెద్దాపురం: పోక్సో చట్టంపై విద్యార్థులు ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పెద్దాపురం సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ కె.దీపాదైవకృప అన్నారు. ఆర్‌బీకొత్తూరు పాఠశాలలో శనివారం విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి దైవకృప మాట్లాడుతూ విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలన్నారు. తదనంతం పోక్సో చట్టంపై అవగాహన కల్పించినట్లైతే అత్యాచారాల నియంత్రణ సాధ్యపడుతుందన్నారు. బార్ అసోషియేషన్ అధ్యక్షుడు వేదుల సుబ్రహ్మణ్యం, ఏపీపీ వినయ్‌తేజ, ఆర్.కామేశ్వరరావు, న్యాయవాదులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలతో తగ్గిన దిగుబడి

- రైతుల ఫిర్యాదుతో శాస్త్రవేతల పరిశోధనలు
- పెట్టుబడి కూడా రాదంటున్న రైతులు

సామర్లకోట: ప్రస్తుత దాళ్వా సీజన్‌లో నకిలీ విత్తనాలు కారణంగా పంట దిగుబడి సగానికి పైగా తగ్గిపోయిందని రైతులు వాపోతున్నారు. మండల పరిధిలో పీబీ దేవం గ్రామంలో 1153 రకం విత్తనం అధిక దిగుబడిని ఇస్తుందనే నమ్మకంతో రైతుల ఎక్కువగా ఈ రకాన్ని సాగు చేశారు. కొంత మంది రైతులు ఈ విత్తనం సాగు చేసిన రైతుల నుంచి విత్తనాలు కొనుగోలు చేశారు. సుమారు 50 మంది రైతులు డీలరు వద్ద 1153 రకం విత్తనాన్ని కొనుగోలు చేసి సాగు చేశారు. వరి పంట కోతకు రావడంతో కోతలు కోయగా ఎకరానికి 17 నుంచి 30 బస్తాలకు మించి దిగుబడి రాలేదని రైతులు చెప్పుతున్నారు. రైతుల నుంచి విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేస్తే 50 నుంచి 60 బస్తాల వరకు దిగుబడి వచ్చినట్టు మాజీ సొసైటీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు మలకల వరహాలబాబు తెలిపారు. దీనిపై మండల వ్యవసాయాధికారి దృష్టికి తీసుకు వెళ్లడంతో మార్టెరుకు చెందిన శాస్త్రవేత్త లు శనివారం వరి కోత ప్రయోగం చేశారు. ప్రయోగంలో దిగుబడి తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. అయితే విత్తనంలో లోపమా, భూమిలో లోపమా, నీటిలో లోపమా అనే విషయాలను గుర్తించడానికి ధాన్యం కంకిలను మార్టెర్ పరిశోధన కేంద్రాన్నికి తీసుకు వెళ్లారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి ఐ.సత్య విలేకరులతో మాట్లాడుతూ నకిలీ విత్తనాలను గుర్తిస్తే డీలరు నుంచి నష్ట పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. విత్తనాలను కొనుగోలు చేసే సమయంలో వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు. ఈ పంట ప్రయోగంలో మార్టెరు శాస్త్రవేత్తలు డాక్టర్లు భువనేశ్వర్, ఎ.సీతారామ్, సుధారాణి, ఈ రాధిక, వ్యవసాయ విస్తరణాధికారి, ఏఏఓలు, రైతులు పాల్గొన్నారు.



పొలంలో పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు, రైతులు

వచ్చే విద్యా సంవత్సరం నాటికి ఉపాధ్యాయుల బదిలీలు

సామర్లకోట: వచ్చే విద్యా సంవత్సరం నాటికి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు బదిలీ అవుతారని జిల్లా ఉప విద్యాశాఖాధికారి నాయుడు వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ×విద్యార్థినితో మోకాళ్ల వేయించిన టీచరు॥ అనే విషయం తెలిసిందే. పాఠశాల హెచ్‌ఎం యు.మీనామాధురి అధ్యక్షతన శనివారం విద్యార్థిని, ఆమె కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులతో పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశానికి డీవైఈఓ హాజరయ్యారు. హిందీ టీచరుపై శాఖాపరమైన చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బాలిక మహేశ్వరీ కుటుంబ సభ్యులు, బంధువులు, కౌన్సిలర్లు పాఠశాలకు చేరుకున్నారు. విద్యార్థులలో మార్పు తీసుకురావడానికి నోటితో చెప్పాలని, అప్పటికి వినకపోతే తల్లిదండ్రులకు ఫిర్యాదు చేయాలని కుటుంబ సభ్యులు అన్నారు. విద్యార్థిని చేతికి ఉన్న ఒక పూస తగిలిందనే కోపంతో బాలికను మోకాళ్ల వేయించడం ఎంత వరకు సమంజసమని కౌన్సిలర్లు పిట్టా సత్యనారాయణ, పాలిక కుసుమచంటిలు ప్రశ్నించారు. ఆరోగ్యం సహకరించడం లేదని బాలిక చెప్పినా కొట్టడంతో పాటు మోకాళ్ల వేయించిన హిందీ టీచరు భారతిలక్ష్మిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యక్తిగత కోపంతో చేసింది కాదని క్రమశిక్షణలో భాగంగా మోకాళ్ల వేయించానని హిందీ టీచరు భారతిలక్ష్మి అంగీకరించి తప్పును క్షమించాలని, ఇక ముందు ఇటువంటి పరిస్థితి రాకుండా చూసుకుంటామని హిందీ టీచరు అప్పాలజీ చెప్పారు. తరచూ అనేక మంది బాలికలపై హిందీ టీచరు ప్రవర్తన ఇదే విధంగా ఉందని, పాఠశాల హెచ్‌ఎంను చూసి పాఠశాల పేరు పోతుందనే అనేక విషయాలు బయట పెట్టడం లేదని కౌన్సిలర్లు, విద్యా కమిటీ వైస్ చైర్మన్ పి.లోవరాజు ఆరోపించారు. హిందీ టీచరు ఇచ్చట పని చేయడానికి వీలులేదని కుటుంబ సభ్యులు పట్టుపట్టారు. దాంతో డీవైఈఓ స్పందిస్తూ ఒక నెల రోజుల పాటు ఓపిక పడితే వచ్చే విద్యా సంవత్సరం నాటికి ఉపాధ్యాయుల బదిలీల్లో ఉపాధ్యాయులను బదిలీ చేస్తామన్నారు. హిందీ టీచరు నుంచి లిఖిత పూర్వకంగా హామీ పత్రం తీసుకుంటామని డీవైఈఓ చెప్పడంతో కుటుంబ సభ్యులు, కౌన్సిలర్లు శాంతించారు.



కౌన్సిలర్లు, విద్యార్థిని కుటుంబ సభ్యుల నుంచి సమాచారం సేకరిస్తున్న డీవైఈఓ వెంకటేశ్వరరావు

కిటకిటలాడిన నూకాలమ్మ ఆలయం

సామర్లకోట: కొత్త అమావాస్యను పురస్కరించుకొని స్థానిక స్టేషన్ సెంటర్‌లో ఉన్న నూకాలమ్మ ఆలయంలో పూజలు జరిగాయి. నెల రోజుల పాటు జరిగే అమ్మవారి ఉత్సవాలు సందర్భంగా శనివారం తిరునాళ్లు ప్రారంభమయ్యాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకొంటున్నారు. దీనిలో భాగంగా అనేక గ్రామాల నుంచి భక్తు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ధర్మకర్త వల్లూరి బుల్లియ్య ఆధ్వర్యంలో ఆలయ కమిటీ నాయకులు గోలి దొరబాబు, యార్లగడ్డ శ్రీనివాసు, పెనుమర్తి వీరవెంకటసత్యనారాయణ, మార్ని శ్రీను, బొమ్మాలరావు, సత్తి అరుణ భక్తులకు సేవలందించారు. సాయంత్రం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

ఊరూరా కొత్త అమావాస్య పూజలు

కొత్తపల్లి: గ్రామాల్లో కొత్త అమావాస్య పర్వదినం పురస్కరించుకొని శనివారం గ్రామ దేవతలకు పూజలు చేశారు. ఉగాది ముందు రోజు వచ్చే కొత్త అమావాస్యకు ప్రత్యేక విశిష్టత ఉంది. సంవత్సరమంతా చేతికందిన పంటను దేవుని వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేస్తారు. ప్రతి ఇంట అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలను చేస్తారు. యండపల్లిలో ఉన్న నూకాలమ్మ తల్లి తీర్థం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారికి చలివిడి, వడపప్పు సమర్పించారు. నూకాలమ్మతల్లిని దర్శించుకునేందుకు కొత్తపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి, అమీనాబాద్, రమణక్కపేట తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్థానిక నూకాలమ్మ యూత్ సభ్యులు మజ్జిగ పంపిణీ చేశారు.



సామర్లకోటలోని నూకాలమ్మ అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

అశ్లీల నృత్యాలపై కేసు

కొత్తపల్లి: జాతర్లలో అశ్లీల నృత్యాలు ప్రదర్శించిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు శనివారం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని మూలపేటలో ఉన్న పోలేరమ్మతల్లి జాతర సందర్భంగా ఈ నెల 26 తేదీ రాత్రి అశ్లీల నృత్యాలను ప్రదర్శించడంపై పలువురు ఫిర్యాదు చేశారు. దీనిపై ఉత్సవ కమిటీ పెద్దలు, అశ్లీల నృత్యాలు ప్రదర్శించిన వారిపై ఎస్సై వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.